తెలంగాణ పసిడి జోరు

ఖేలో ఇండియా వింటర్ గేమ్స్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: లఢాక్ (జమ్ము కశ్మీర్) వేదికగా జరుగుతున్న 4వ ఖేలో ఇండియా వింటర్ గేమ్స్‌లో తెలంగాణ పతక జోరు కొనసాగుతున్నది. మంగళవారం జరిగిన బాలికల అండర్-17 ఐస్ స్కేటింగ్ 300మీ, 500మీటర్ల విభాగాల్లో నయన శ్రీ తాల్లురి రెండు స్వర్ణ పతకాలతో మెరిసింది. మరోవైపు బాలుర 500మీటర్ల ఐస్ స్కేటింగ్ కేటగిరీలో ప్రణవ్ మాధవ్ స్వర్ణంతో పాటు రజతం సొంతం చేసుకున్నాడు. జాతీయ ఐస్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు అమితాబ్ శర్మ..తెలంగాణ స్కేటర్లను ప్రత్యేకంగా అభినందించారు.

వరుణ్‌పై పోక్సో కేసు

హైదరాబాదీ అమ్మాయిపై హాకీ ప్లేయర్ లైంగిక దాడి • చికుల్లో భారత హాకీ ప్లేయర్

బెంగళూరు: భారత హాకీ జట్టు ప్లేయర్ వరుణ్‌కుమార్ భాగోతం బట్టబయలైంది. మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడినందుకు బెంగళూరు పోలీసులు వరుణ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ప్రస్తుతం జాతీయ హాకీ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న వరుణ్‌పై ఐపీసీ 376(3)(లైంగిక దాడి), 420(మోసం) కింద మంగళవారం కేసులు నమోదయ్యాయి. హైదరాబాద్‌కు చెందిన అమ్మాయిపై వరుణ్ పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు పోలీసులు పేర్కొన్నారు. వివరాల్లోకెళితే బెంగళూరులోని జాతీయ క్రీడా ప్రాధికార సంస్థ(సాయ్)లో సదరు అమ్మాయి వాలీబాల్‌లో శిక్షణ పొందుతున్న సమయంలో వరుణ్‌తో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి తన స్నేహితుల సహాయంతో అమ్మాయితో చనువుగా మెలిగేందుకు ఈ హాకీ ప్లేయర్ ప్రయత్నించినట్లు తెలిసింది. ఆ అమ్మాయి ఒప్పుకోకపోయినా ప్రేమిస్తున్నానంటూ వరుణ్ బలవంతం చేసినట్లు బయటపడింది. ఇలా ఒకే కేంద్రంలో శిక్షణ తీసుకోవడంతో ఇద్దరి మధ్య చనువు ఏర్పడింది. ఇది అలుసుగా తీసుకున్న వరుణ్..ఆ అమ్మాయి 17 ఏండ్ల వయసులో ఉన్నప్పుడు లైంగిక దాడి పాల్పడ్డాడని సమాచారం. పెండ్లి చేసుకుంటానని నమ్మబలికిన కుమార్..నగరంలోని హోటల్లలో పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు ఆ అమ్మాయి తన ఫిర్యాదులో పేర్కొంది. ఈ విషయం బయటికి చెబుతానన్న ప్రతీసారి తనతో కలిసి ఉన్న ఫొటోలను సోషల్‌మీడియాలో పోస్ట్ చేస్తానని బెదిరించే వాడని ఆమె గోడు వెల్లబోసుకుంది. గత ఐదేండ్లుగా తనను మోసం చేస్తున్న వరుణ్‌పై తాజాగా అమ్మాయి బెంగళూరులో కేసు పెట్టింది. హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన వరుణ్ 2017లో జాతీయ హాకీ జట్టులో అరంగేట్రం చేశాడు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం గెలిచిన భారత జట్టులో వరుణ్ సభ్యుడు.

హైదరాబాద్‌లో ఫిఫా అర్హత మ్యాచ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్..ప్రతిష్ఠాత్మక ఫిఫా ప్రపంచకప్ క్వాలిఫయర్ పోరుకు ఆతిథ్యమివ్వబోతున్నది. నగరం వేదికగా జూన్ 6వ తేదీన ఆతిథ్య భారత్, కువైట్ జట్ల మధ్య మ్యాచ్ జరుగనుంది. ఈ విషయాన్ని తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్(టీఎఫ్ఏ) కార్యదర్శి జీపీ ఫాల్గుణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్ తొలిసారి ఫిఫా అర్హత పోరుకు వేదికవుతున్న నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డిని ఫాల్గుణ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర క్రీడా సంఘాలకు ఆర్థిక తోడ్పాటు అందించాలని సీఎంను కోరగా అందుకు సానుకూలంగా స్పందించినట్లు ఫాల్గుణ తెలిపారు.

నవరత్నాలు

తొమ్మిదోసారి ఫైనల్ చేరిన భారత్ • సెమీస్‌లో దక్షిణాఫ్రికాపై జయకేతనం

- సచిన్, ఉదయ్ అసమాన పోరాటం
- అండర్-19 ప్రపంచకప్

ఉదయ్ (81)

అండర్-19 ప్రపంచకప్‌లో యువ భారత జట్టు అదరగొట్టింది. చివరి వరకు హోరాహోరీగా సాగిన సెమీ ఫైనల్లో యంగ్‌ఇండియా 2 వికెట్లతో దక్షిణాఫ్రికాను చిత్తుచేసి.. రికార్డు స్థాయిలో తొమ్మిదోసారి తుదిపోరుకు చేరింది!

245 పరుగుల లక్ష్యఛేదనలో 32 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడ్డ జట్టును కెప్టెన్ ఉదయ్, సచిన్ దాస్ ఆదుకున్నారు. సఫారీ గడ్డపై అసమాన పోరాటంతో మ్యాచ్‌ను మనవైపు తిప్పారు. మరే జట్టుకూ సాధ్యం కాని రీతిలో ఇప్పటికే ఐదుసార్లు జగజ్జేతగా నిలిచిన యంగ్‌ఇండియా.. ఆస్ట్రేలియా, పాకిస్థాన్ మధ్య జరిగే రెండో సెమీస్ విజేతతో ఆదివారం కప్పుకోసం కలబడనుంది!!

బెనోని (దక్షిణాఫ్రికా): యువ ఆటగాళ్లు సమిష్టిగా కదంతొక్కడంతో.. అండర్-19 ప్రపంచకప్‌లో భారత్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన యంగ్‌ఇండియా.. ఈ టోర్నీలో ఓటమి ఎరగకుండా తుదిపోరుకు చేరింది. మంగళవారం ఉత్కంఠభరితంగా సాగిన సెమీఫైనల్లో యంగ్ ఇండియా 2 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తుచేసింది. ఈ మెగాటోర్నీలో భారత జట్టు తుదిపోరుకు అర్హత సాధించడం ఇది తొమ్మిదోసారి కాగా.. వరుసగా ఐదోసారి. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 244 పరుగులు చేసింది. ఓపెనర్ ప్రిటోరియస్ (76; 6 ఫోర్లు, 3 సిక్సర్లు), రిచర్డ్ (64; 4 ఫోర్లు, 2 సిక్సర్లు) అర్ధశతకాలతో రాణించారు. భారత బౌలర్లలో రాజ్ లింబాని 3, ముషీర్ ఖాన్ రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో యంగ్‌ఇండియా 48.5 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 248 పరుగులు చేసింది. ఉదయ్ సహ్రాన్ (81; 6 ఫోర్లు) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకోగా.. సచిన్ దాస్ (95 బంతుల్లో 96; 11 ఫోర్లు, ఒక సిక్సర్) తృటిలో శతకం చేజార్చుకున్నాడు. ఒక దశలో 32 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి.. ఇక ఇంటిబాట పట్టడం ఖాయమే అనుకుంటున్న దశలో ఈ ఇద్దరు గొప్ప సంయమనం చూపారు. క్రీజులో నిలదొక్కుకునేందుకు సమయం తీసుకున్న ఈ జోడీ.. ఆ తర్వాత సఫారీ బౌలర్లను దీటుగా ఎదుర్కొంది. ఉదయ్ క్రీజులో పాతుకుపోతే.. సచిన్ ఎడాపెడా బౌండ్రీలతో స్కోరు బోర్డును ఉరకలెత్తించాడు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు 171 పరుగులు జోడించడంతో భారత్ మంచి స్థితికి చేరింది. చివర్లో కాస్త ఉత్కంఠ ఎదురైనా.. రాజ్ లింబాని (4 బంతుల్లో 13 నాటౌట్; ఒక ఫోర్, ఒక సిక్సర్) భారీ షాట్‌లతో మ్యాచ్‌ను ముగించాడు. సఫారీ బౌలర్లలో క్వెనా, ట్రిస్టన్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. గురువారం ఆస్ట్రేలియా, పాకిస్థాన్ మధ్య రెండో సెమీస్ జరగనుంది.

సచిన్ దాస్ (96)

సంక్షిప్త స్కోర్లు

దక్షిణాఫ్రికా: 50 ఓవర్లలో 244/7 (ప్రిటోరియస్ 76, రిచర్డ్ 64; రాజ్ 3/60, ముషీర్ 2/43), **భారత్:** 48.5 ఓవర్లలో 248/8 (సచిన్ 96, ఉదయ్ 81; క్వెనా 3/32, ట్రిస్టన్ 3/37).

9 అండర్-19 ప్రపంచకప్‌లో భారత జట్టు ఫైనల్‌కు చేరడం ఇది తొమ్మిదోసారి. 2000, 2008, 2012, 2018, 2022లో ట్రోఫీ చేజిక్కించుకున్న యంగ్ ఇండియా.. 2006, 2016, 2020లో రన్నరప్‌గా నిలిచింది.

5 అండర్-19 ప్రపంచకప్‌లో యువభారత్ ఫైనల్ చేరడం ఇది వరుసగా ఐదోసారి.

రేపటి నుంచి జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: రెండు దశాబ్దాల తర్వాత జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌సిప్ పోటీలకు హైదరాబాద్ ఆతిథ్యమిస్తున్నది. ఈ విషయాన్ని రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జీవితకాల అధ్యక్షుడు మర్రి లక్ష్మణ్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గురువారం నుంచి నాలుగు రోజుల పాటు పోటీలు జరుగుతాయని తెలిపారు. దేశంలోని 20 రాష్ట్రాల నుంచి నాలుగు వేల మంది ప్లేయర్లు బరిలో దిగుతున్నారని వెల్లడించారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. లాంగ్‌జంప్, హైజంప్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో, స్ప్రింట్, హర్డిల్స్, లాంగ్ డిస్టెన్స్ పోటీలను 30 నుంచి 70పై బడిన వయసు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుకుమార్, రాజేశ్వరి, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

ఆసీస్ క్లీన్‌స్వీప్

కాన్‌బెర్రా: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఆస్ట్రేలియా.. వెస్టిండీస్‌పై వన్డే సిరీస్ క్లీన్‌స్వీప్ చేసింది. మంగళవారం జరిగిన మూడో వన్డేలో ఆస్ట్రేలియా 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొదట విండీస్ 24.1 ఓవర్లలో 86 పరుగులకు ఆలౌటైంది. అలిక్ అథన్‌జే (32) టాప్ స్కోరర్ కాగా.. కంగారూ బౌలర్లలో జేవియర్ 4 వికెట్లు తీశాడు. అనంతరం లక్ష్యఛేదనలో ఆసీస్ 6.5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 87 పరుగులు చేసింది. జాక్ ఫ్రజెర్ (41; 5 ఫోర్లు, 3 సిక్సర్లు), ఇంగ్లిస్ (35 నాటౌట్; 4 ఫోర్లు ఒక సిక్సర్) దంచికొట్టారు. జేవియర్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్', 'మ్యాన్ ఆఫ్ ది సిరీస్' అవార్డులు దక్కాయి.

విలియమ్సన్ (109)

కేన్ మరో సెంచరీ

మౌంట్ మాంగనీ: బ్యాటర్ల కృషికి బౌలర్ల సహకారం తోడవడంతో దక్షిణాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్టులో న్యూజిలాండ్ భారీ ఆధిక్యం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 80/4తో మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా 162 పరుగులకు ఆలౌటైంది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన న్యూజిలాండ్.. మంగళవారం ఆట ముగిసే సమయానికి 4 వికెట్లు కోల్పోయి 179 పరుగులు చేసింది. కేన్ విలియమ్సన్ (109) మరో సెంచరీతో చెలరేగాడు. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కలుపుకొని ప్రస్తుతం కివీస్ 528 పరుగుల ముందంజలో ఉంది.

జూలై 6 నుంచి జింబాబ్వే టూర్

- ఇరు జట్ల మధ్య 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్

హరారే: పొట్టి ప్రపంచకప్ ముగిసిన వారం రోజుల్లోనే భారత జట్టు జింబాబ్వేలో పర్యటించనుంది. ఈ ఏడాది జూన్‌లో వెస్టిండీస్, అమెరికా వేదికగా టీ20 ప్రపంచకప్ జరగనుండగా.. జూలై 6 నుంచి జింబాబ్వే టూర్ ప్రారంభం కానుంది. దీంట్లో భాగంగా టీమ్‌ఇండియా 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడనుంది. అయితే.. గతంలో మాదిరిగానే జింబాబ్వే పర్యటనకు బీసీసీఐ ద్వితీయ శ్రేణి జట్టును ఎంపిక చేసే అవకాశాలున్నాయి.

క్వార్టర్స్‌లో సచిన్

సోఫియా(బల్గేరియా): ప్రతిష్ఠాత్మక స్ట్రాంజా స్మారక బాక్సింగ్ టోర్నీలో సచిన్, సాగర్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. మంగళవారం జరిగిన పురుషుల 57కిలోల ప్రిక్వార్టర్స్‌లో సచిన్..ఫైజోవ్(ఉజ్బెకిస్థాన్)పై గెలిచాడు. మరోవైపు 92కిలోల బౌట్‌లో సాగర్..జాజెవిసిస్ జోసస్(లిత్వేనియా)పై గెలిచి ముందంజ వేశాడు. మహిళల విభాగంలో అరుంధతి క్వార్టర్స్‌లోకి ప్రవేశించింది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.